క్లుప్తంగా

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ


పార్వతి, తహసీల్దారు

చినగంజాం: చినగంజాం తహసీల్దార్‌గా పాలపర్తి పార్వతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. బాపట్ల జిల్లా కలెక్టరేట్‌లో ఏవోగా పనిచేస్తూ ఆమె బదిలీపై చినగంజాం వచ్చారు. ముందుగా స్థానిక శివాలయంలో పూజలు నిర్వహించి కార్యాలయానికి వచ్చిన ఆమెను కార్యాలయ సిబ్బంది అభినందించారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సుబ్బారెడ్డి


సుబ్బారెడ్డికి బొకే అందజేస్తున్న సీతారత్నం

బల్లికురవ: బల్లికురవ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా జీవీ సుబ్బారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ వీ. సీతారత్నం బాపట్ల కలెక్టరేట్‌కు బదిలీకాగ సుబ్బారెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని వినతి


ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

బల్లికురవ: ఉపాధ్యాయులపై దురుసుగా మాట్లాడుతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న బల్లికురవ ఎంఈవో బీ. వీరరాఘవయ్యపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఎంపీడీవో సీహెచ్ కృష్ణకు యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. రెండేళ్లుగా ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్‌లీవ్‌లు, మెడికల్ లీవ్‌లు ఇవ్వకుండా వార్షిక తనిఖీల పేరిట డబ్బు దండుకుంటూ వేధిస్తున్నారని తెలిపారు. నాడు-నేడు పనులకు తను చెప్పిన వారిదగ్గరే మెటీరియల్ కొనుగోలు చేయాలని చెప్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో యూటీఎఫ్ మండలశాఖ బాధ్యుడు డీ. శేషగిరి, సీ హెచ్ శ్రీనివాసరెడ్డి, సీ. వీరాంజనేయులు పీ . రామాంజనేయులు, సీహెచ్ అచ్యుత మోహన్, ఎంపీడీవోతోపాటు మండల పార్టీ కన్వీనర్ పేరయ్యకు వినతి పత్రం అందజేశారు.

పారిశుద్ధ్యంపై అవగాహన అవసరం


ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న డీపీవో శంకర్‌నాయక్

మేదరమెట్ల: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచేందుకుగాను ప్రజల్లో అవగాహనకల్పించాలని డీపీవో ఎస్ శంకర్‌నాయక్ సూచించారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామ పంచాయితీలోని ఎస్‌డబ్ల్యూపీసీ లోని శిక్షణ కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీపీవో పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతూ ఇంటి వద్దనుంచి తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలన్నారు. రోడ్ల పక్కన చెత్త వేయకుండా చూడాలని, కార్మికులతో పాటు ప్రజలు కూడా పరిశుభ్ర వాతావరణంలో ఉండేలా అవగాహన పెంచుకోవాలన్నారు. డీపీవో వెంట సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ, ఈవో లక్ష్మీకాంత్, కార్మికులు ఉన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ధర్నా


ఆర్డీవో సరోజినికి వినతి పత్రం ఇస్తున్న నియోజకవర్గ అభివృద్ధి సాధన సమితి

చీరాల: నియోజకవర్గంలోని చీరాల మున్సిపాలిటీ, రూరల్ గ్రామాల్లో జరుగుతున్న ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ అభివృద్ధి సాధన సమితి నాయకులు ఆర్డీవో పి.సరోజినికి వినతి పత్రం అదించారు. సోమవారం చీరాల ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి చీరాల్లో జరుగుతున్న భూ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ చీరాల పొలిమేర రోడ్డులో కోర్టులో ఉన్న స్థలంలో మూడు దుఖాణాలు నిర్మించి అద్దెలకివ్వడం వాటికి పన్నులు విధించడం, రోడ్డు మార్జిన్‌లో నిర్మాణం చేపట్టడం, కారంచేడు రోడ్డులోని లారీ ఓనర్స్ అసోసియేషన్ బిల్డింగ్, ఎస్సీ ఎస్టీ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేసి పన్నులు విధించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు బాబురావు, వెంకటేశ్వర్లు, శివరామ్‌ప్రసాద్, ఏసురత్నం, తదితరులు ఉన్నారు.


పూనూరులో పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు


అద్దంకి: పరీక్ష హాలులో విద్యార్థులు


వేటపాలెంలో పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు

పటిష్ట బందోబస్తు.. ప్రశాంతంగా పది పరీక్షలు

- ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్
- అరగంట ముందుగానే చేరుకున్న విద్యార్థులు
- కేంద్రాల వద్ద మౌలిక వసతులు

పర్చూరు/చినగంజాం/యద్దనపూడి/కారంచేడు/మార్టూరు: విద్యార్థుల జీవితంలో తొలిమెట్టు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా మొదలయ్యాయి. పర్చూరు మండల కేంద్రమైన పర్చూరులోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్, వైఆర్ హైస్కూల్, నాగులపాలెంలోని ఎస్ఎఫ్ఐ హైస్కూల్, అన్నంభొట్లవారిపాలెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి మొదటి రోజు తెలుగు పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముసిగింది. ఈ నాలుగు కేంద్రాల్లో మొత్తం 643 మంది విద్యార్థులకుగాను 639 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో నాగేశ్వరరావు తెలిపారు. కేంద్రాలను తహసీల్దారు నెహ్రూబాబు, ఎంపీడీవో లక్ష్మీదేవి, ఎంఈవో నాగేశ్వరరావు పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లోని ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. మరలా 6వ తేదీన హిందీ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు ఎస్సై చెంచుప్రసాద్ తెలిపారు.

■ కారంచేడు మండలంలోని స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పది పరీక్షల్లో మొత్తం 145 మందికి గాను 145 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎగ్జామ్ చీఫ్ మూకిరి దేవదత్తం తెలిపారు. పరీక్ష జరుగుతున్న తీరును తహసీల్దారు ఎస్ వెంకటరత్నం, ఎంపీడీవో ఆర్ రమేష్‌లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో స్పాట్ ఆఫీసర్ మధుసూదనరావు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ హైమావతిలు పాల్గొన్నారు.

■ యద్దనపూడి మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఉండగా పూనూరులో 135 మంది, యద్దనపూడిలో 138 మంది విద్యార్థులను కేటాయించారు. మొత్తంగా రెండు పరీక్ష కేంద్రాల్లో 270 మంది విద్యార్థులకుగాను ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. కేంద్రాలను తహసీల్దార్ వెంకటరెడ్డి, ఎస్సై రత్నకుమారి పరిశీలించారు.

■ మార్టూరు మండలంలోని ఐదు సెంటర్లలో పదో తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. 1063 మంది విద్యార్థులకుగాను ఎనిమిది మంది గైర్హాజరయ్యారని ఎంఈవో వస్త్రాంనాయక్ తెలిపారు. మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 197 మందికి ఒకరు, రాయల్ హైస్కూల్‌లో 190 మందికి ఇద్దరు, శ్రీచైతన్యలో 177కి ఒకరు, వలపర్లలో 197కి మరొకరు గైర్హాజరయ్యారు.

■ చినగంజాం, కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలను ఎంపీడీవో విజయలక్ష్మి పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పర్యవేక్షించారు. చినగంజాం పరీక్ష కేంద్రంలో 260 మంది, కడవకుదురు పరీక్ష కేంద్రంలో 169 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా చినగంజాం పరీక్ష కేంద్రంలో ముగ్గురు విద్యార్థులు, కడవకుదురులో నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. తహసీల్దారు పి. పార్వతి పరీక్ష కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలోని అన్ని గదులను పరిశీలించారు.

పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు..

అద్దంకి/అద్దంకి రూరల్/ జే.పంగులూరు/మేదరమెట్ల/బల్లికురవ: పది పరీక్షలు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రశాంతంగా సాగుతున్నాయి. జే.పంగులూరు మండల పరిధిలోని పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 214 మంది విద్యార్థులు, ముప్పవరంలో 154 మందికిగాను 53 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మంచినీరు, మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

■ అద్దంకిలోని ఐదు పరీక్ష కేంద్రాలు, తిమ్మాయపాలెంలోని ఒక పరీక్ష కేంద్రంలో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 1046 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

■ కొరిశపాడు మండల పరిధిలో పది పరీక్షకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్‌లు తెలిపారు. మండలంలో మేదరమెట్ల, రావినూతల జెడ్పీహెచ్ఎస్‌లతో పాటు సెయింట్ ఆర్నాల్డ్స్ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మేదరమెట్లలో 170 మందికిగాను 168, ఆర్నాల్డ్స్ హైస్కూల్‌లో 148 మందికిగాను 147 విద్యార్థులు, రావినూతల జెడ్పీహెచ్ఎస్‌లో 167 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద కొరిశపాడు, మేదరమెట్ల ఎస్సైలు వెంకటేశ్వర్లు, శివకుమార్‌లు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఐదుగురు విద్యార్థుల గైర్హాజరు..

సంతమాగులూరు మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో 581 మంది విద్యార్థులకుగాను పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్..

వేటపాలెం/చీరాల: పది పరీక్షలకు చీరాల మండలంలో 10 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1639 మంది విద్యార్థులకు తెలుగు పరీక్ష ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. మొదటి రోజు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాలకు వద్దకు చేరుకుని ధైర్యం చెప్పి లోపలికి పంపించారు. తెలుగు పరీక్షకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పదోతరగతి పరీక్ష కేంద్రాలను చీరాల ఆర్డీవో పి.సరోజిని, తహసీల్దార్ ప్రభాకరరావు, ఎంపీడీవో నేతాజీలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.


వైఆర్ హైస్కూల్ వద్ద విద్యార్థుల హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న పోలీసులు


అద్దంకిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకట సుబ్బారెడ్డి

■ వేటపాలెం మండల పరిధిలోని ఐదు సెంటర్లలో జరిగిన పదో తరగతి తెలుగు పరీక్షలకు 1093 మంది విద్యార్థులు హాజరయ్యారు. 1,011 మంది హాజరు కావాల్సి ఉండగా ఏనిమిది మంది గైర్హాజరయ్యారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 180 మంది, వేటపాలెం బాలికోన్నత పాఠశాల్లో 264 మందికిగాను 258 మంది పరీక్షలకు హాజరయ్యారు. కొత్తపేట మదర్ థెరిస్సా స్కూల్‌లో 148 మందికి గాను 147 మంది, కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో 310 మందికిగాను 309 మంది, కొత్తపేటలోని నారాయణ హైస్కూల్‌లో 199 మంది పరీక్షలకు హాజరయ్యారు.


నాగులపాలెంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఎస్సై చెంచుప్రసాద్


వేటపాలెం: పరీక్ష కేంద్రం వద్ద నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు


వలపర్లలో పరీక్ష సెంటర్‌కు వస్తున్న విద్యార్థులు


బందోబస్తు నిర్వహిస్తున్న మేదరమెట్ల ఎస్సై శివకుమార్


చినగంజాం పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ పార్వతి

ఘనంగా జిల్లా ఆవిర్భావ దిన వేడుకలు


సెంటర్‌లో జిల్లా పేరుతో వేసిన రంగుల ముగ్గు

అద్దంకి: బాపట్ల జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. దీనిలో భాగంగా పట్టణంలోని కొత్తపేటలోని అంగన్‌వాడీ సెంటర్లో నిర్వహించిన కార్యక్రమానికి కొరిశపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో కృష్ణకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త చంద్రమతి, సూపర్‌వైజర్ పద్మావతి, ఇందిర, గర్భిణులు, బాలింతలు, తల్లులు, పిల్లలు, పాల్గొన్నారు.


కారంచేడులో విద్యుత్ దీపాల కాంతిలో కార్యాలయాలు

కారంచేడు: బాపట్ల జిల్లా ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా మండలంలో ఆవిర్భావ దినోత్సవాలకు సర్వ సద్ధం చేస్తున్నామని తహసీల్దార్ ఎస్. వెంకటరత్నం తెలిపారు. మంగళవారం ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఆయన ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

చీరాల టౌన్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, దైవనామ స్మరణ చేస్తే సత్ఫలితాలు ఇస్తాయని దైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి సూచించారు. సోమవారం పేరాలలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పీఠాధిపతి పాల్గొన్నారు. పీఠాధిపతి శివస్వామికి ఆలయ అర్చకులు, పాలకవర్గం సభ్యులతో కలిసి ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పలు ఆధ్యాత్మిక సూచనలు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ ప్రతినిధులు, దేవదాయశాఖ అధికారులు, సిబ్బంది అర్చకులు పాల్గొన్నారు.


శివస్వామిని సత్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

హనుమంత వాహనంపై సీతారాములు

చీరాల టౌన్: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని వీరరాఘవ పేటలోని రామమందిరంలో ఏర్పాటు చేసిన నవమి వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి సీతారామ లక్ష్మణులస్వామి వార్ల నగరోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా హనుమంత వాహనాన్ని పలు రకాల పూలతో సుందరంగా అలంకరంచి విశేష పూజల అనంతరం పట్టణ వీధుల్లో నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు దిట్టకవి వాసుదేవాచార్యులు పూజలు జరిపించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.


భక్తులకు దర్శనమిస్తున్న సీతారాములస్వామి

చెన్నకేశవాలయానికి భారీగా తలనీలాల ఆదాయం

మార్కాపురం టౌన్: లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి తలనీలాల ఆదాయం గత ఏడాది కంటే రూ.6 లక్షలు అదనంగా సమకూరింది. ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలను ఏడాదిపాటు పోగు చేసుకునే హక్కును సోమవారం నిర్వహించిన వేలంలో టెండర్‌దారులు రూ.13.51 లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాది ఇదే హక్కుకు రూ.7.50 లక్షలు మాత్రమే ఆదాయం వచ్చింది. వేలాన్ని ఆలయ కమిటీ చైర్మన్ పి.కేశవరావు, ఈఓ జి.శ్రీనివాసరెడ్డి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.


వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

నేడు ఆసరా చెక్కులు పంపిణీ

యద్దనపూడి: వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం వెలుగు కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయ సిబ్బంది సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ పాల్గొంటారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల డ్వాక్రా మహిళలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

శింగరకొండ దర్శిని


అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం చైత్ర మాసం పుబ్బ నక్షత్రం త్రయోదశి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయస్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు.

తిరునాళ్లకు సహకరించాలి


ఈర్లగంగమ్మ తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

బల్లికురవ: బల్లికురవ సమీపంలోని ఈర్లగంగమ్మ వార్షిక తిరునాళ్ల గురువారం ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు, సహకరించాలని ఇన్‌చార్జి సీఐ ఫిరోజ్ కోరారు. సోమవారం తిరునాళ్ల ఈర్లకొండను ఎస్సై వీ వేమనతో కలిసి పరిశీలించారు. ప్రభల ఏర్పాటు స్థలాలు, బైకుల పార్కింగ్ స్థలం, అమ్మవారి దర్శనానికి బారికేడ్లు తదితర ఏర్పాట్లతో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

నేడు అరుణాచలానికి ప్రత్యేక బస్సు

మార్కాపురం టౌన్: కార్తీక పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని అరుణాచలం పుణ్యక్షేత్రానికి మార్కాపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తెలిపారు. ఈ బస్సు ఈ నెల 4వ తేదీ రాత్రి 10 గంటలకు మార్కాపురంలో బయలుదేరి మళ్లీ 7వ తేదీ ఉదయం మార్కాపురం చేరుతుందని, చార్జీ రూ.2500గా నిర్ణయించామని పేర్కొన్నారు. ప్రయాణంలో కాణిపాకం, వేలూరు, కంచి, తిరుత్తణి, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చని వివరించారు.

బీసీలు ఐక్యంగా ఉండాలి

యర్రగొండపాలెం: బీసీలందరూ ఐక్యంగా ఉండి రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని బీసీ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు యాపర్తి వీరయ్య అన్నారు. సోమవారం స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆ సంఘ నియోజకవర్గస్థాయి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ బీసీ సంఘాల నాయకులు బట్టపోతుల వెంకటేశ్వర్లు, ఎస్.కొండయ్య, ఎస్.శ్రీనివాస్, డి.బాలయ్య, బి.కాశయ్య పాల్గొన్నారు.

భార్యపై భర్త దాడి

మేదరమెట్ల: భార్యపై భర్త దాడిచేయడంతో గాయాలయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండలంలోని రాచపూడి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బీ స్వాతి, సిద్ధయ్య భార్యభర్తలు. కొన్నాళ్లు సంసారం బాగానే సాగింది. గత కొంతకాలంగా వారిరువురు వేర్వేరుగా ఉంటున్నారు. భర్తకు మరో స్త్రీతో ఒంగోలులో సహజీవనం గడుపుతూ ఇటీవలే భార్య వద్దకు వచ్చాడు. అత్తమామల ప్రోత్సాహంతో తనపై దాడి చేశాడని బాధితురాలు కొరిశపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ఘనంగా విజయాంజనేయస్వామి తిరునాళ్ల


అలంకరణలో విజయాంజనేయ స్వామి

దొనకొండ: స్థానిక అడ్డరోడ్డులో పాపులమ్మ బావి వద్ద వెలసిన విజయాంజనేయస్వామి తిరునాళ్లను భక్తులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయం విద్యుత్ దీపాలతో ముస్తాబైంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఏటా శ్రీరామనవమి వెళ్లిన 4వ రోజు జరుపుకుంటున్నట్లు ఆలయ ధర్మకర్త శిరిగిరెడ్డి బాలిరెడ్డి తెలిపారు. దాతల సహకారంతో భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

దివ్యాంగుడి జీవనోపాధికి సాయం

ఒంగోలు అర్బన్: దివ్యాంగుడైన షేక్ నబికి జీవనోపాధి కల్పించేందుకు జెరాక్స్, ప్రింటర్, స్కానర్ పరికరాలను సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు అందించింది. ప్రవాస భారతీయుడు చల్లగుంట్ల అశోక్ సహకారంతో రూ.40 వేల విలువైన పరికరాలను స్థానిక కర్నూలు రోడ్డులోని ట్రస్టు కార్యాలయం వద్ద సోమవారం నబికి అందజేశారు. కార్యక్రమంలో మారెళ్ల సుబ్బారావు, ట్రస్టు సెక్రటరీ సర్దార్‌బాషా, నేరెళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.